క్లుప్తంగా

ఘనంగా కవిరాజు జయంతి



గుడ్లవల్లేరు: కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి స్వగ్రామం అంగలూరులో ఆయనకు ఆ గ్రామ ఉప సర్పంచ్ త్రిపురనేని సురేష్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించారు. కవిరాజు విగ్రహానికి గ్రామ సర్పంచ్ మేడేపల్లి రవికుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానికులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో త్రిపురనేని హితీష్, గ్రామస్తులు బొర్రా ధనకోటి, కమ్యూనిస్ట్ నాయకుడు ఆర్సీపీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగానమ్మ జాతర



జమీదగ్గుమిల్లి(పామర్రు): మండల పరిధి జమీదగ్గుమిల్లి గ్రామంలోని రజకుల ఆధ్వర్యంలో గంగానమ్మ జాతర అత్యంత వైభవంగా సోమవారం జరిగింది. తొలుత ఆలయంలోని అమ్మ వారికి 108 జల బిందెలతో జలాభిషేకం నిర్వహించారు. అనంతరం పసుపు, కుంకుమలను సమర్పించారు. నూతన వస్త్రాలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం స్థానిక రజక వాడ నుంచి గ్రామంలోని వీధుల వెంబడి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని భక్తులు మొక్కుబడులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో రజకులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



గుడ్లవల్లేరు: సంక్రాంతిని పురస్కరించుకుని వాసవీ క్లబ్ గుడ్లవల్లేరు అధ్యక్షురాలు కొల్లిపర అనసూయ ఆధ్వర్యంలో శ్రీ కన్యకా పరమేశ్వరీ పంచాయన క్షేత్రంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ముఖ్య అతిథిగా విచ్చేసిన వాసవీ క్లబ్ జిల్లా ఇన్‌చార్జి శేగు బబిత చేతుల మీదుగా అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు కన్సోలేషన్ బహుమతులను అందించారు. వాసవీ క్లబ్ జిల్లా క్యాబినెట్ జాయింట్ డైరెక్టర్ గాదె మోహన్‌బాబు, క్లబ్ కోశాధికారి చిట్టూరి శ్రీనివాస్, కార్యదర్శి బచ్చు సుదర్శన్, సభ్యులు పాల్గొన్నారు.

మండవల్లిలో విశేష పూజలు



విశేష అలంకారంలో మల్లేశ్వరస్వామి, భ్రమరాంబదేవి

మండవల్లి: గ్రామాల్లో సంక్రాంతి పండుగ శోభ వెల్లివిరిసింది. సోమవారం ప్రజలు కనుమ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. మూడు రోజులు జరిగే ఈ పండుగలో బంధువులు, స్నేహితులతో ఇళ్లన్నీ కళకళలాడాయి. స్థానిక మల్లేశ్వరస్వామి మందిరంలో కొలువైఉన్న శ్రీభ్రమరాంబదేవి, శ్రీమల్లేశ్వర స్వామిలను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజించారు.

గోమాతకు ఘనంగా సీమంతం



నాగాయలంక:గ్రామంలోని సాలిపేటలో సోమవారం గోమాతకు సీమంత మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కృష్ణానదీతీరంలో కొలువైన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ అర్చకుడు మహేశ్వరపు శ్రీనివాసగాంధీ సంరక్షణలోని గోమాత మీనాక్షికి తొమ్మిది నెలల సూడి నిండిన సందర్భంగా సీమంతం చేశారు. దేవదాయశాఖలో టెక్నికల్ ఆఫీసర్, ప్రముఖ మిమిక్రీస్టార్ భవిరి రవి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గాంధీ బ్రహ్మత్వంలో రవి దంపతులు, ఆ ఇంటి మహిళలు సంప్రదాయ రీతిలో గోమాత సీమంతం పూజలు నిర్వహించారు. గోవులకు సంబంధించిన భక్తిగీతాల గానంతో సందడి చేశారు. ఆ ఇంటికి చెందిన 9 కుటుంబాలు 60 మంది సభ్యులతో ఈ వేడుకను చేశారు. రిటైర్డ్ ఎంఈఓ భవిరి శంకరనాథ్, బ్రహ్మంగారి ఆలయ ధర్మకర్త సుధాకర్, గ్రామ ప్రముఖులు తదితరులు ఈవేడుకలో పాల్గొని సీమంతం నిర్వాహకులను అభినందించారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

పామర్రు: గుడివాడ, పామర్రు, కైకలూరు నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం, సోమవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. పండుగను పురస్కరించుకుని గ్రామగ్రామానా వేడుకలు నిర్వహించారు. తొలుత చిన్నారులు బొమ్మల కొలువులను ఏర్పాటు చేసుకుని బొమ్మలకు పూజలు చేశారు. యువతులు రహదారుల వెంబడి వేసిన రకరకాల ముగ్గులు అందరినీ అలరించాయి. పలు చోట్ల ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గంగిరెద్దుల వారి విన్యాసాలు అలరించాయి. ఇళ్ల ముంగిటకు వచ్చిన హరిదాసులు భక్తి గీతాలను ఆలపించి బిక్షను సేకరించారు.

తోట్లవల్లూరులో వేడుకలు

తోట్లవల్లూరు: సంక్రాంతి పర్వదిన వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే స్నానాలాచరించి నూతన వస్త్రాలను ధరించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇళ్ల ముందు మహిళలు, యువతులు అందమైన రంగవల్లులు వేయటంతో పాటు పిండివంటలు, పూలు, పండ్లతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. బంధుమిత్రులు, కొత్త అల్లుళ్ల రాకతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన కోడిపందేలను పెద్ద సంఖ్యలో ప్రజలు తిలకించారు.

ఆనందోత్సాహాలతో సంబరాలు

గుడివాడటౌన్/గుడ్లవల్లేరు: గుడివాడ నియోజకవర్గంలో సంక్రాంతి వేడుకలు ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల రాకతో గ్రామాల్లో సందడి నెలకింది. రైతు భరోసా అందించి ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి సకాలంలో ప్రభుత్వం రైతుకు సొమ్ము చెల్లించడంలో రైతులు సంతోషంగా పర్వదినాన్ని జరుపుకున్నారు.



పెనమకూరులో ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

ఎమ్మెల్యే కొడాలి నాని ఏర్పాటు చేసిన ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలు ప్రత్యేక ఆకర్షణీయంగా నిలువగా ముగ్గుల పోటీలు, చిన్నారుల ఆటపాటలు, పెద్దల కోడి పందేలు, భోగిమంటలు, హరిదాసుల గేయాలు, గంగిరెద్దుల నృత్యాలు, బంధుమిత్రుల పలకరింపులతో ఈ ఏడాది ఆనందంగా ప్రజలు వేడుకలు జరుపుకున్నారు.

పల్లెలో సంబరాలు

కైకలూరు: సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. సుదూర ప్రాంతాల్లో స్థిరపడ్డ ప్రజలు పండుగకు సొంతూళ్లకు చేరుకున్నారు. దీంతో గ్రామాలు కళకళలాడాయి. కొత్త అల్లుళ్లకు స్వాగతం పలికారు. చిన్నారులు పతంగులతో ఉల్లాసంగా గడిపారు. పల్లెల్లో పిండి వంటల ఘుమఘుమలు నోరూరించాయి. గ్రామాల్లో బొమ్మల కొలువులు, డూడూ బసవన్నల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు, ఆడపడుచుల సంక్రాంతి ముగ్గులు ఎంతో ఆకట్టుకున్నాయి. పండగ సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కైకలూరు మీసాల వెంకన్న స్వామిగా ప్రసిద్ధి చెందిన శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు అత్యంత ఘనంగా జరిగాయి. వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ప్రజాప్రతినిధుల గృహాల వద్ద సంక్రాంతి సందడి నెలకొంది.



ఆటల పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

రాష్ట్రంలో పక్షి ప్రేమికుల స్వర్గధామంగా పేరుగడించిన ఆటపాక పక్షుల కేంద్రాన్ని వేలాది మంది పర్యాటకులు సందర్శించారు.

సంప్రదాయబద్ధంగా కోడి పందేలు

పామర్రు, గుడ్లవల్లేరు, కైకలూరు పరిధిలోని పలు గ్రామాల్లో కోడి పందేలు సంప్రదాయకబద్ధంగా జరిగాయి. సుదూర ప్రాంతాల నుంచి అనేక మంది ఇక్కడకు తరలివచ్చి కోడి పందేలను ఆసక్తిగా తిలకించారు. దీంతో గ్రామాల్లోని రహదారుల్లో వాహనాల రద్దీ నెలకొంది.



హరిదాసునికి దానం చేస్తున్న మహిళ



గుడివాడలో ఎడ్ల పోటీలను వీక్షిస్తున్న ప్రేక్షకులు



గుడివాడలో బండలాగుతున్న ఎడ్ల జత



పామర్రులో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న యువతులు



దొడ్డిపట్లలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు



పామర్రులో ఆకర్షణగా బొమ్మల కొలువు



గుడివాడలో ఆకట్టుకున్న రంగవల్లి



మీసాల వెంకన్న స్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

భాస్కరరావుపేటలో దాతల ఔదార్యం

కైకలూరు(కలిదిండి): సంక్రాంతి పండుగ వేళ కలిదిండి మండలం భాస్కరరావుపేట గ్రామానికి చెందిన రేమల్లి సుందరరావు, ప్రభావతి కుమారులు సురేష్‌బాబు, సునీల్‌బాబు ఔదార్యం చాటారు. ఆస్ట్రేలియా, హైదరబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా స్థిరపడిన వారు సోమవారం గ్రామంలో రూ.2.50 లక్షల విలువైన 50 మంది విద్యార్థులకు సైకిళ్లు, 50 మంది వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గద్దె ఆనంద్‌కుమార్, టి.యాకోబు, కారి కృష్ణ గ్రామస్తులు పాల్గొన్నారు. అదే విధంగా సంక్రాంతి సమయంలో యువత జూదాలకు ఆకర్షితులు కాకుండా గ్రామానికి చెందిన పాంగిలేటి దశమంతురావు, కవిత దంపతులు ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. 50 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సవాకుల పద్మ, డాక్టర్ బుజ్జిబాబు, పెదలంక కాలనీ సొసైటీ అధ్యక్షుడు బీవీ వసంతరావు, ఆదిత్య, నవ్య, పాంగిలేటి ఇజ్రాయేల్, గ్రామస్తులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న సురేష్‌బాబు

ఏసుక్రీస్తు మార్గం అనుసరణీయం

అడ్డాడ(పామర్రు): ఏసుక్రీస్తు చూపిన సేవా మార్గంలో ప్రతీ ఒక్కరూ పయనిస్తూ ఆయన బోధనలను అనుసరించాలని దైవజనులు శిలువ మిషన్ అధినేత క్రీస్తు రాయభారి పేర్కొన్నారు. మండల పరిధిలోని అడ్డాడ గ్రామంలోని శిలువ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిలువ పండుగ కార్యక్రమాలను సోమవారం ఘనంగా నిర్వహించారు.

పాస్టర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాస్టర్ల సంక్షేమం కోసం ప్రత్యేకంగా వారికి వేతనాలను అందిస్తోందని అన్నారు. రాష్ట్రంలోని హైదరాబాద్, గుంటూరు, విశాఖపట్నం, విజయనగరం తదితర ప్రాంతాల నుంచే కాకుండా చెన్నై, తెలంగాణా తదితర రాష్ట్రాల నుంచి అనేక మంది క్రీస్తు విశ్వాసులు పాల్గొని సాక్షాలను ఇచ్చారు. దైవజనురాలు లూధియానా, పాస్టర్లు ప్రభు, మిల్కిషదక్(రామకృష్ణ), అకుల్లా(ప్రసాద్), సత్యం, విజయ్‌శేఖర్, అబ్రహాంతో పాటు పరిసర గ్రామాల నుంచి అనేక మంది క్రీస్తు విశ్వాసులు పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరాలపై పోలీసుల దాడులు

కైకలూరు: జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాలతో కైకలూరు నియోజకవర్గం అన్ని మండలాల్లో కోడి పందేలు, పేకాట, గుండాటలపై సోమవారం పోలీసులు దాడులు చేశారు. అనేక గ్రామాల్లో పందేల కోసం వేసిన టెంటులను స్వయంగా ఎస్ఐలు ధ్వంసం చేశారు. కై కలూరు రూరల్ సర్కిల్ సీఐ వైవీవీఎల్ నాయుడు, పట్టణ సీఐ ఎంవీఎస్ నాగరాజు ఆదేశాలతో అన్ని చోట్ల పందేలను నిలుపుదల చేశారు.

కలిదిండి మండలంలో కోడిపందేలు, పేకాటకు సంబంధించి 36 కేసుల్లో 70 మంది వ్యక్తులపై కేసులు నమోదు చేసి, వారి వద్ద నుంచి 10 పుంజులు, రూ.30,710 నగదును స్వాధీనం చేసుకున్నారు. మండవల్లి మండలంలో కోడిపందేలు, పేకాట, గుండాటలపై 17 కేసులు నమోదు కాగా రూ.53,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. కైకలూరు రూరల్ స్టేషన్ పరిధిలో సోమవారం భుజబలపట్నం, ఆలపాడు, వరహాపట్నం గ్రామాల్లో కోడిపందేలు, పేకాట, గుండాట నిమిత్తం 8 కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.4,570 నగదును స్వాధీనం చేసుకున్నారు.



కలిదిండి మండలంలో శిబిరాలను తొలగిస్తున్న ఎస్ఐ మణికుమార్

సువార్త సభలు ప్రారంభం

గుడివాడటౌన్: దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమతులు ప్రతి ఒక్కరూ పొందాలని అంతర్జాతీయ సువార్తీకులు బ్రదర్ అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ గ్రౌండ్స్‌లో ఆదివారం సాయంత్రం ఆయన నిర్వహించిన ఏసుక్రీస్తు ఆశీర్వాద పండుగల సువార్త సభలను ప్రారంభించారు. కార్యక్రమంలో పలు క్రైస్తవ సంఘాలకు చెందిన పాస్టర్లు, సువార్తీకులు, సంఘ నాయకులు, యూత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు పెనుమాకలంకలో గడప గడపకు మన ప్రభుత్వం

మండవల్లి: మండలంలోని పెనుమాకలంక గ్రామంలో మంగళ, బుధవారాల్లో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము) సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డీఎన్నార్ ప్రభుత్వ పథకాలు వివరించడంతో పాటు ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

28న రథసప్తమి వేడుకలు

మచిలీపట్నంటౌన్:నగరంలోని ఆజాద్‌రోడ్డులో ఉన్న కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఈ నెల 28వ తేదీ రథసప్తమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయ ప్రాంగణంలోని సూర్యనారాయణస్వామికి పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మాఘమాసం సందర్భంగా ఈ నెల 22, 29, ఫిబ్రవరి 5, 12, 19 తేదీల్లో సూర్యనమస్కారాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులు హాజరై సూర్యభగవానుని అనుగ్రహం పొందాలని కోరారు.

వైభవంగా శాంతి కల్యాణం

అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి శాంతి కల్యాణంను వైభవంగా నిర్వహించారు. మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని దీవి మనోజ్ దంపతులు స్వామివారికి శాంతి కల్యాణం చేశారు. తొలుత స్వామివార్లను ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణలు చేయించారు. దీవి వెంకట రామశ్రీనివాస్, దీవి వెంకట్రామాచార్యులు, అప్పలాచార్యులు, డీవీఎస్ కృష్ణ, నరసింహమూర్తి పర్యవేక్షించారు.

ప్రజల వద్దకే వైద్య సేవలు

- అర్బన్ హెల్త్ కేంద్రాల్లోనే అన్ని పరీక్షలు
- అందుబాటులో 65 రకాల మందులు
- ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా సేవలు

గుడివాడటౌన్: ప్రతి పేదవాడు ఆరోగ్యంగా ఉండాలని దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆలోచన సాకారమయ్యే రోజులు త్వరలోనే ఉన్నాయి. గ్రామీణ వైద్యం మెరుగుపర్చేందుకు కుటుంబ వైద్య విధానం ప్రభుత్వం అమలుకు రంగం సిద్ధం చేసింది. ప్రతి ప్రైమరీ హెల్త్ సెంటర్‌లోని వైద్యులు ఆ గ్రామాలకు వెళ్లి అక్కడే వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సబ్ సెంటర్లు(ఉప కేంద్రాలు) ఏర్పాటు చేసి నెలకు రెండు పర్యాయాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన వైద్యులు సంబంధిత గ్రామాలకు చేరుకుని వైద్య పరీక్షలు అందజేస్తారు. 104 ద్వారా అక్కడ 14 రకాల వైద్య పరీక్షలు చేసి చికిత్స చేస్తారు. 104 వాహనంలో వైద్యపరీక్షల కిట్‌లతో పాటు 65 రకాల మందులు అందుబాటులో ఉంటాయి. ప్రాథమిక వ్యాధులకు సంబంధించిన చికిత్సకు ఈ మందులు సరిపోతాయని వైద్య అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ప్రతి ఉప కేంద్రంలోనూ నెలకు రెండు సార్లు ఈ వైద్య శిబిరాలు పనిచేస్తాయని వైద్యులు అంటున్నారు.

అతి త్వరలో పరీక్షలు..

ఒకే చోట సంబంధిత వైద్యుడు, ఏఎన్ఎం, ఆశా వర్కర్, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ అందుబాటులో ఉంటారు. దీంతో అప్పటికే రోగికి సంబంధించిన వ్యాధిపై దిగువ స్థాయి సిబ్బందికి అవగాహన ఉన్నందున చికిత్స అందించడానికి వైద్యులకు సులభమవుతుంది. ప్రత్యేకించి ఇక్కడ గర్భిణులు, బాలింతలు, రక్తహీనతతో బాధపడుతున్న రోగులు, మధుమేహం, బీపీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యసేవలందుతాయన్నారు. ప్రత్యేకించి క్యాన్సర్ అనుమానిత లక్షణాలను కౌన్సెలింగ్ ద్వారా ఇక్కడ గుర్తిస్తారని అవసరాన్ని బట్టి మెరుగైన వైద్యం కొరకు ఇతర ప్రభుత్వ ఆస్పత్రులకు తరలిస్తామని చెప్పారు. ఇన్ని రకాలుగా ప్రజలకు వైద్యసేవలందించే ఈ విధానం అతి త్వరలో ప్రజలకు చేరువకానున్నట్లు వైద్యాధికారులు తెలిపారు.



అర్బన్ హెల్త్ సెంటర్

అందుబాటులో వైద్య సేవలు..



గ్రామీణ ప్రాంతాల్లో వైద్యంపై నిర్లక్ష్య ధోరణి ఎక్కువగా ఉంటుంది. దుకాణాల్లో దొరికే మందులు తీసుకుంటూ వ్యాధి ముదిరే వరకూ ఆలస్యం చేస్తారు. ఈ విధానం ప్రవేశపెట్టినందున రోగికి ఏ విధమైన చికిత్స అవసరమో పరీక్షల ద్వారా బయటపడుతుంది. తద్వారా సకాలంలో వైద్యసేవలు అందడంతో రోగి ఆరోగ్యంగా కోలుకుంటాడు.

– సంఘమిత్ర, రామాపురం, పీహెచ్‌సీ వైద్యుడు.

విద్యుదాఘాతంతో రేకుల షెడ్డు దగ్ధం

పెదన: మండలంలోని నందమూరు గ్రామ పంచాయతీ శివారు కోటవానిపాలెంకు చెందిన పేరం చిననాగరాజు నివశిస్తున్న రేకులషెడ్డు ఇల్లు సోమవారం అగ్నికి ఆహుతైంది. వీఆర్వో, బాధితులు తెలిపిన వివరాల మేరకు ఇంట్లోని వారు పని నిమిత్తం బయటకు వెళ్లడంతో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. ఆస్తి నష్టంపై ఇంకా అంచనాకు రాలేకపోయారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎంపీటీసీ కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు తాతాబ్రహ్మ విష్ణుపరమేశ్వరరావు, బెనర్జీ, భగవాన్, వాకాలయ్య తదితరులు బాధితులను కలిసి ఆర్థిక సాయాన్ని అందజేశారు. బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి ఉన్నత పాఠశాలలో 1998వ సంవత్సరం వరకు కలసి విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత కలుసుకుని సందడి చేశారు. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన విద్యార్థులు ఎల్‌కేజీ నుంచి పదవ తరగతి 1998 వరకు కలసి చదువుకున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామాలకు చేరుకున్న వీరంత 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తమకు విద్యా బోధన చేసిన పాఠశాలలో కలుసుకోవాలని ముందస్తు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 15వ తేదీన కుటుంబాలతో కలుసుకున్న వీరంతా గత స్మృతులు గుర్తు చేసుకుంటూ, ఒకరిని ఒకరు పలకరించుకుంటూ, ఉద్యోగ, వ్యాపార, కుటుంబ క్షేమ సమాచారాలు తెలుసుకుంటూ అలరించారు. అనంతరం పాఠాలు నేర్పిన పాఠశాల డైరెక్టర్ కె. కిషోర్, ఉపాధ్యాయులు ఎస్. శేఖర్, బి.యుగంధర్, పి.బసవయ్య, కె.శ్రీనివాస్, పి. వెంకటలక్ష్మి దంపతులను సత్కరించి జ్ఞాపికలు అందచేశారు.

ఆనాటి జ్ఞాపకాలు ఎంతో మధురం

పెడన: ఆనాటి జ్ఞాపకాలు ఎంతో మధురమని, ఆ మధురస్మృతులు ఎన్నటికీ గుర్తుండి పోవాలనే ఉద్దేశంతోనే ఆత్మీయ సమ్మేళనం, ఆపూర్వ కలయికలు నిర్వహించుకుంటున్నామని పూర్వ విద్యార్థులు స్పష్టం చేశారు. స్థానిక భట్ల జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1975–76లో పదో తరగతి చదవిన బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం గూడూరు రోడ్డులోని దేవాంగ కల్యాణమండపంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ఉత్రూతలూగించారు. కుమారి మేఘన భరతనాట్యం ఆకట్టుకోగా, పూర్వ విద్యార్థులు పలు గీతాలకు స్టేజ్‌పై నృత్యాలు చేయడంతో ఆసక్తిగా తిలకించారు. చందన నారాయణ, బొడ్డు రామమూర్తి, జల్లూరి రాధాకృష్ణ, మల్లంపల్లి శ్రీనివాసరావు, బండి రవీంద్ర, వార్త త్రిపురసుందరి, పెరిశెట్టి టికేశ్వరి, జక్కుల ధనంజయ తదితరులతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను మరిచిపోవద్దు...

తల్లిదండ్రులను ఎప్పటికీ మరిచిపోవద్దని ఆనాటి గురువులు పూర్వ విద్యార్థులకు సూచించారు. సోమవారం స్థానిక భట్ల జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1977–78లో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆపూర్వ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఆనాటి గురువులు తేజోవతి, భానుమతి, సరస్వతి, జయలక్ష్మీ, ప్రభాకరావును సన్మానించి పాదాభివందనాలు చేశారు. తాము పాఠాలు నేర్పించిన విద్యార్థులు నేడు వివిధ రంగాలలో స్థిరపడి మమ్మలను గుర్తుపెట్టుకుని సన్మానించడం చాలా అదృష్టంగా భావిస్తున్నామని తేజోవతి అన్నారు. చదువుకుని ఆశువులు బాసిన వారికి నివాళులర్పించి మౌనం పాటించారు. కర్ల నాగమల్లేశ్వరరావు, నందం హరినాథ్, కొండుపర్తి విజయశంకర్, జన్యావుల లీలాకృష్ణ నేతృత్వం వహించారు.



విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులతో కొమ్మారెడ్డి పాఠశాల 1998 పూర్వ విద్యార్థులు